చెన్నైకి పొంచి వున్న జలగండం ?

- 2040 నాటికి హార్బర్, ఐల్యాండ్‌గ్రౌండ్, పళ్లిక్కరణై ప్రాంతాలు నీట మునక
- 86.6 చదరపు కి.మీటర్ల భూభాగానికి ప్రమాదం
- 1987 నుంచి 2021 వరకు 0.679 సెం.మీ పెరిగిన సముద్రపు నీటిమట్టం


మెరీనా తీరం

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరం చెన్నైకి జలగండం పొంచివుందా?.. నగరంలోని పలు ప్రధాన ప్రాంతాలు సముద్రంలో మునిగిపోవడం ఖాయమా?.. తూత్తుకుడి నగరానికీ ముప్పు తప్పదా?.. అవుననే అంటోంది బెంగళూరుకు చెందిన 'సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ పాలసీ స్టడీస్' సంస్థ. ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న భూతాపం, ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణ పరిస్థితులపై ఆ సంస్థ చేసిన అధ్యయనం మేరకు 2040 నాటికి చెన్నై నగరంలోని పలు ప్రాంతాలు నీట మునగడం తథ్యమని తేలింది.

ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులు, భూతాపం తదితరాలపై అధ్యయనం చేస్తున్న ఆ సంస్థ.. మన దేశంలోని తూర్పు, పశ్చిమతీర ప్రాంతాలకు చెందిన 15 నగరాలకు జలగండం వున్నట్లు ప్రకటించింది. ఇందులో ముంబై, చెన్నై, విశాఖ వంటి నగరాలుండడం గమనార్హం. రోజురోజుకు పెరుగుతున్న జనాభా కారణంగా పలు సముద్రతీర ప్రాంతాలు జనమయంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నెలకొన్న వివిధ పరిణామాల వల్ల సముద్రపు అడుగుభాగం క్రమేణా పెరుగుతోంది. దీనికి తోడు వాతావరణ మార్పుల కారణంగా సముద్రం నీటిమట్టం పెరిగి, తీరంలో ఉండే లోతట్టునగరాలను ముంచెత్తే అవకాశముంది. ఈ ప్రభావం చెన్నైపై కొంత మేర పడే అవకాశముంది. ఆ మేరకు 2040 నాటికి చెన్నై నగరంలో 7.29 శాతం భూభాగం నీటిలో మునిగిపోవచ్చని అంచనా. 7.29 శాతం అంటే 86.6 చదరపు కి.మీటర్ల భూభాగం సముద్రంలో మునిగిపోతుందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యం గా చెన్నై హార్బర్, అడయార్ పార్కు, ఐల్యాండ్ గ్రౌండ్, పళ్లిక్కరణై ప్రాంతం నీట మునిగే అవకాశముంది. 2060 సంవత్సరంలో 9.65 శాతం (114.31 చ.కి.). 2080లో 15.11 శాతం (159.28 చ.కి.) 2100 సంవత్సరం నాటికి 16.9 శాతం (207.04 చ.కి) నీట మునిగిపోవచ్చని అంచనా. వాతావరణ పరిణామాల నేపథ్యంలో ఇది మరింత అధికమయ్యే అవకాశం కూడా వుంది. కాగా 1987 నుంచి 2021 వరకు చెన్నైలో సముద్ర మట్టం 0.679 సెం.మీటర్లు పెరిగిందని, ఏడాదికి ఒకసారి 0.066 సెం.మీటర్లు చొప్పున పెరుగుతోందని అధ్యయన నివేదికలో వెల్లడించింది. వాస్తవానికి ప్రస్తుతం అసెంబ్లీగా వున్న జార్జ్‌కోట ప్రహరీ వరకు సముద్ర తీరం వుండేది. బ్రిటీషు పాలనలో జాలర్లు జార్జ్‌కోట ప్రహరీ వరకు పడవలతో వచ్చి, చేపల్ని తీసుకువెళ్లే ఫొటోలే ఇందుకు సాక్ష్యం. అయితే తరువాత జరిగిన పరిణామాల్లో భాగంగా సముద్రపు నీరు వెనక్కి మళ్లిందని సీనియర్లు గుర్తు చేసుకుంటున్నారు. కానీ ఇప్పుడు వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఈ నీరు ముందుకొస్తుందని, పలు ప్రాంతాలు మునిగిపోవడం తథ్యమని అధ్యయన నివేదిక హెచ్చరిస్తోంది.


ఐల్యాండ్‌గ్రౌండ్ గూగుల్ చిత్రం

కావేరి మాతకు వందనం

డెల్టా జిల్లాల్లో కోలాహలంగా ఆడిపెరుక్కు

ప్యారీస్, ఆగస్టు 3: రాష్ట్రంలో కావేరి నదీ పరీవాహక ప్రాంతాల్లో ఆడిపెరుక్కు వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. డెల్టా జిల్లాల మీదుగా ప్రవహించి సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుస్తున్న కావేరి తల్లికి విశేష పూజలు చేశారు. ఏటా ఆడి మాసంలో కావేరి నదికి కృతజ్ఞతలు తెలిపేలా ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. తమిళ ఆడి (ఆషాఢ మాసం)లో వచ్చే 18వ రోజును ఆడిపెరుక్కుగా జరుపుకుంటారు. ప్రస్తుతం పొరుగు రాష్ట్రం కర్ణాటకలో భారీవర్షాలు కురుస్తుండడంతో కావేరి నదిలోకి నీరు పుష్కలంగా చేరింది. దీంతో ఈ ఏడాది ఆడిపెరుక్కు పూజలతో డెల్టా జిల్లాల్లో శనివారం ఉదయం సందడి నెలకొంది. పరీవాహక ప్రాంతాల్లో వేలాదిమంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. అలాగే, రాష్ట్రంలో కావేరి పరీ వాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాలు, పుష్కర ఘాట్‌లు భక్తులతో పోటెత్తాయి. భక్తుల సౌకర్యార్థం సముద్రంలా తలపిస్తున్న పుష్కరఘాట్‌లలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా పుణ్యస్నానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈరోడ్ జిల్లా....

జిల్లాలోని కావేరి, భవాని నదులు సంగమ ప్రాంతమైన కూడుదురైలో తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు గుమిగూడారు. మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేసిన సాగు జలాలు కూడుదురైలో పొంగి ప్రవహించింది. అందువల్ల అగ్నిమాపక సిబ్బంది భక్తులు లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా పుష్కరఘాట్లలో బ్యారికేడ్లు ఏర్పాటుచేశారు. స్నానమాచరించిన అనంతరం సంగమేశ్వరర్, వేదనాయకి అమ్మవారు, ఆదికేశవ పెరుమాళ్‌న దర్శనం చేసుకున్నారు.

కడలూరు జిల్లా...

డెల్టా చివరి ఆయకట్టు ప్రాంతమైన చిదంబరం పరిసర ప్రాంతాలు, కొల్లిడం జలాశయంలో కొత్త దంపతులు తమ వివాహ సమయంలో ధరించిన పూలమాలలు నదీ ప్రవాహంలో వదిలి కావేరి తల్లిని పూజించారు.

సేలం జిల్లా...

జిల్లాలోని ఎడప్పాడి సమీపంలో ఉన్న బూలంపట్టి కావేరి నది కాలువ తీరంలోని పుష్కరఘాట్‌లో పసుపుతో చేసిన వినాయకుడు, కావేరి మాత రూపాలు పెట్టి నెయ్యి దీపాలు వెలిగించి హారుతులిచ్చి నూతన దంపతులు పూజలు చేశారు. అలాగే, మేట్టూరు డ్యాం పరిసరాల్లో మునియప్ప ఆలయంలో భక్తులు స్వామివారికి చేపల వంటకాలు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం కుటుంబసభ్యులంతా కలసి దానిని ఆహారంగా తీసుకున్నారు. రాష్ట్రంలో కావేరి ప్రవహించే హొగేనేకల్ నుంచి సముద్రంలో కలిసే పూంపుహార్ వరకు కావేరి నది తీరాలు భక్తులతో కిటకిటలాడాయి. కన్నియాకుమారి జిల్లాలోని త్రివేణిసంగమం, మేల్‌మలయనూరు అండాళ్ ఆలయం, స్థానిక బీసెంట్ నగర్ అష్టలక్ష్మి ఆలయం, మైలాపూర్ కపాలీశ్వర ఆలయం, తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయం, తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సురభి ఘాట్ తదితర ప్రాంతాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. కాగా, రైతులు తమ పొలాల్లో దిగుబడి చేసిన పంటలను సూర్య భగవానుడికి నైవేద్యంగా సమర్పించి సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

కావేరికి సారె సమర్పించిన రంగనాథుడు...

తిరుచ్చి జిల్లా శ్రీరంగం రంగనాథ స్వామి ఆలయం తరఫున ఆడిపెరుక్కు పర్వదినం సందర్భంగా కావేరి మాతకు సారె సమర్పించే కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఉదయం 6.30 గంటలకు నంపెరుమాళ్‌ను బంగారు పల్లకీలో అమ్మ మండపం పుష్కర ఘాట్‌కు ఆలయ పూజారులు ఊరేగింపుగా తరలించారు. 11 గంటలకు స్వామివారికి తిరుమంజనం నిర్వహించి ఆలయం తరఫున పట్టువస్త్రాలు, మంగళసూత్రం, పసుపు కుంకుమ తదితరాలను కావేరి నదిలో వదిలారు.


ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి
కావేరి తల్లికి సారెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ పూజారులు

దిండుగల్ సమీపంలో రోడ్డు ప్రమాదం

- రెండు మోటారు సైకిళ్లను ఢీకొన్న కారు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

పెరంబూర్, ఆగస్టు 3: దిండుగల్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. వివరాలిలా... రెంటాల్ పారై ప్రాంతానికి చెందిన జార్జ్ (30)- అరుణ (28) దంపతులకు రక్షిత (7) అనే కుమార్తె, రక్షణ్ (5) అనే కుమారుడున్నాడు. శనివారం ఉదయం అరుణ తల్లి సరోజాదేవి (60) అస్వస్థతకు గురవడంతో ఆమెను, తన ఇద్దరు పిల్లలు భార్యతో మోటారుసైకిల్‌పై జార్జ్ ఆసుపత్రికి బయలుదేరాడు. నల్లంపట్టి ప్రాంతంలో ఎదురుగా వచ్చిన ఓ కారు వీరి బైక్ ఢీకొని వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. అదే సమయంలో మరో బైక్‌పై వస్తున్న కుళందైస్వామిని కూడా కారు ఢీకొంది. ఈ ఘటనలో జార్జ్, ఆయన భార్య, ఇద్దరు పిల్లలు తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న దిండుగల్ తాలూకా పోలీసులు అక్కడకు చేరుకొని, ఘటనలో గాయపడిన సరోజాదేవి సహా ముగ్గురిని చికిత్స కోసం దిండుగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒకే మోటార్ సైకిల్‌పై ఐదుగురు ప్రయాణించడమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

ఇక పరుగులే !

రూ.30 కోట్లతో చిల్డ్రన్స్ పార్కు

ప్రారంభించిన సీఎం స్టాలిన్



పార్కులో ఆకట్టుకునే చిత్రాలు


పార్కును ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ మండపం సమీపంలో ఉన్న చిల్డ్రన్స్ పార్కును రూ.30 కోట్లతో ఆధునికీకరించారు. ఈ పార్కును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని ఏ ఇతర పార్కుల్లో లేని సౌకర్యాలను ఇక్కడ కల్పించారు. ముఖ్యంగా 2800 చదరపు టడుగుల విస్తీర్ణంలో అతిపెద్ద నీటిపక్షుల శరణాలయంతో పాటు వన్యప్రాణుల అవగాహన కేంద్రం, జంతువులు, పక్షుల వివరాలు తెలుసుకునేందుకు వీలుగా ఎల్‌ఈడీ స్క్రీన్లు, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్ భవనం, ఆకర్షణీయమైన ప్రవేశద్వారం, ఫౌంటైన్, సెల్ఫీ పాయింట్‌లు, పిల్లల ఆటస్థలం, ఫుట్‌పాత్‌లు, సీసీ కెమెరాలు ఇలా అనేక సౌకర్యాలను ఇక్కడ కల్పించారు. అంతేకాకుండా, ఈ పార్కులో సందర్శకులకు భోజనం, ఫలహారాలు అందించేందుకు వీలుగా ఆధునిక వసతులతో కూడిన రెండు స్నాక్స్ స్టాల్స్, ఫిల్టర్ వాటర్, విశాలమైన పార్కింగ్, మరుగుదొడ్లు, దివ్యాంగులు, వృద్ధులకు అనువుగా ఉండేలా పార్కులో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడీ పార్కును సీఎం స్టాలిన్ ప్రారంభించగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్ముడి, ఎం.సుబ్రహ్మణ్యం, మదివేందన్, నగర మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ తమిళిచ్చి తంగపాండ్యన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, అటవీ శాఖ కార్యదర్శి పి.సెంథిల్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సుధాన్షు గుప్తా, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్కును ప్రారంభించిన అనంతరం స్టాలిన్.. తన మంత్రివర్గ సహచరులతో కలిసి పార్కు మొత్తం కలియతిరిగారు.

కాగా, చెన్నై నగరంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన చిల్డ్రన్స్ పార్కుకు ప్రతియేటా సుమారు 7 నుంచి 8 లక్షల మంది వరకు సందర్శకులు వస్తుంటారు. చెన్నై మహానగరంలోని పాఠశాలల విద్యార్థులు ఇక్కడకు విహారయాత్రకు వస్తుంటారు. అలాంటి ఈ పార్కును మరింతగా అభివృద్ధి చేస్తామని సీఎం స్టాలిన్ 2022-23 వార్షిక బడ్జెట్‌లో ప్రకటించారు. ఆ ప్రకారంగానే ఈ పార్కు అభివృద్ధి పనుల కోసం రూ.30 కోట్లు కేటాయించి, ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు.

అన్నాడీఎంకే చేపట్టిన చర్యలు

సువర్ణాక్షరాలతో లిఖించాలి

- ఎస్సీ వర్గీకరణపై మాజీ సీఎం ఎడప్పాడి

అడయార్, ఆగస్టు 3: ఎస్సీ ఎస్టీ వర్గీరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి స్వాగతించారు. ఈ చారిత్రత్మక తీర్పు వెలువడటానికి ప్రధాన కారణం గతంలో అన్నాడీఎంకే తీసుకున్న చర్యల ఫలితమేనన్నారు. అన్నాడీఎంకే చేసిన కృషిని, తీసుకున్న చర్యలను చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించాలని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రిజర్వేషన్లకు చట్టభద్రత కల్పించడమే కాకుండా ఈ రిజర్వేషన్లను వంద శాతం అమలు చేసిన పార్టీ అన్నాడీఎంకే అని గుర్తుచేశారు. దీనికి తమ పార్టీ పరిరక్షకులైన ఎంజీఆర్, జయలలిత ముఖ్య కారణమని, వారి పేర్లను సువర్ణాక్షరాలతో లిఖించాలన్నారు. వెనుకబడిన వర్గాలకు 31 శాతం ఉన్న రిజర్వేషన్లను 50 శాతానికి పెంచిన ఘతన దివంగత ఎంజీఆర్‌కు దక్కుతుందన్నారు. ఆ తర్వాత ఈ రిజర్వేషన్లను 69 శాతానికి పెంచడమే కాకుండా, భారత రాజ్యాంగం శాసనంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి, ఆ మేరకు రిజర్వేష్లను రాష్ట్రంలో అమలు చేసిన నాయకురాలి జయ అని పేర్కొన్నారు. ఎంజీఆర్, జయలలిత చూపిన మార్గాల్లో తన సారథ్యంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలకు భద్రత కల్పిస్తూనే వారి అభ్యున్నతికి పాటుపడిందన్నారు. అరుంధతీయులకు మూడు శాతం అంతర్గత రిజర్వేషన్లు ఇచ్చామన్నారు. అయితే, ఈ రిజర్వేషన్లను ఎత్తివేయాలని 2010లో డీఎంకే ప్రభుత్వంలో మదురై హైకోర్టులో ఒక పిటిషన్ వేశారన్నారు. అయితే, అరుంధతీయులకు అమలు చేసిన మూడు శాతం రిజర్వేషన పరిరక్షణ కోసం 2020లో తన సారథ్యంలో ప్రభుత్వం వేసిన కమిటీ సిఫార్సుల మేరకు సీనియర్ న్యాయవాదితో సుప్రీంకోర్టులో అభిప్రాయాలను వెల్లడించడం జరిగిందన్నారు. అనంతరం 2020 ఆగస్టులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రా సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అరుంధతీయుల అంతర్గత రిజర్వేషన్లపై సానుకూలంగా తీర్పునిచ్చారని ఆయన గుర్తు చేశారు. ఆ తర్వాత ఈ కేసు సుదీర్ఘంగా విచారణ జరిపిన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ నెల ఒకటో తేదీ ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా తీర్పునిచ్చిందని ఎడప్పాడి పేర్కొన్నారు.

వరద బాధిత ప్రాంతాల్లో ఎడప్పాడి

రాష్ట్రంలోని కావేరీ నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముంచెత్తింది. ఈ ప్రాంతాల్లో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి .పళనిస్వామి శనివారం పర్యటించారు. ప్రధానంగా నామక్కల్ జిల్లాలో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. కుమారపాళయం కావేరీ నదీ తీర కాలనీలు మణి మేఘలై వీధి, ఇందిరా నగర్, కలైమగల్ వీధి, చిన్నప్ప నాయకన్ పాళెయం, పళ్ళిపాళెయం తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ ప్రాంతాల్లోని 300 కుటుంబాలను రక్షించిన నగర పాలక సంస్థ అధికారులు సహాయక శిబిరాల్లో రక్షణ కల్పించారు. వారిని పరామర్శించిన ఎడప్పాడి కొన్ని నిత్యావసర వస్తువులు, దుప్పట్లు తదితర సహాయాలను అందజేశారు.


వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎడప్పాడి బృందం

ఎస్సీ వర్గీకరణ

డీఎంకే పథకాలకు లభించిన బహుమతి

- సీఎం స్టాలిన్

ప్యారీస్, ఆగస్టు 3: అరుంధతీయుల కోసం రూపొందించిన అంతర్గత రిజర్వేషన్ చట్టం చెల్లుతుందని సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు డీఎంకే ప్రభుత్వ పథకాలకు దక్కిన అరుదైన బహుమతి అని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పునిచ్చిన నేపథ్యంలో.. ఇందు కు మద్దతునిచ్చిన స్టాలిన్‌కు వివిధ అరుంధతీయ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయంలో స్టాలిన్‌ను కలుసుకుని ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్టాలిన్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.


సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న టామ్స్ అధినేత గొల్లపల్లి ఇశ్రాయేలు, నేలటూరి విజయకుమార్ తదితరులు

సుప్రీంకోర్టులో ఎస్సీల వర్గీకరణకు సంబంధించిన కేసు దాఖలవ్వగా, సమాజంలో విద్య, ఆర్థిక సమస్యలతో నలుగుతున్న అణగారిన వర్గాల జీవనశైలి మెరుగుపరచాలని 2008వ సంవత్సరం లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎమ్మెస్ జనార్థనం నేతృత్వంలో 2008 మార్చి 25న ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అరుంధతీయ సంక్షేమ సంఘా లు, తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ ప్రతినిధులతో సమావేశమై రాష్ట్ర జనాభాలో అరుంధతీయుల సంఖ్యా వివరాలను అడిగి తెలుసుకుంది. ఈ కమిటీ నివేదికను పరిశీలించిన రాష్ట్రప్రభుత్వం, ఆదిద్రావిడులకు కల్పించిన 18 శాతం రిజర్వేషన్ నుంచి అరుంధతీయులకు 3 శాతం అంతర్గత రిజర్వేషన్ కల్పించేందుకు 2008 నవంబరు 27న సమావేశమై, రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ప్రకారం చట్టం రూపొందించాలని రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టిన సమయంలో అప్పటి సీఎం కరుణానిధి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. ఆ సమయం లో రాష్ట్ర హోంశాఖ మంత్రిగా వ్యవహరించిన ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ అరుంధతీయులకు 3 శాతం అంతర్గత రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో 2009 ఫిబ్రవరి 26న ప్రవేశపెట్టి సభ్యుల మద్దతుతో నెరవేర్చారు. ఈ నేపథ్యంలో, 3 శాతం అంతర్గత రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ పలు దళిత సంఘాల నాయకులు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. అదే సమయంలో అసెంబ్లీలో నెరవేర్చిన అరుంధతీయుల 3 శాతం రిజర్వేషన్ అంశాన్ని సీఎం స్టాలిన్ సుప్రీంకోర్టుకు తీసుకెళ్లారు. ఈ కేసులో ఇటీవల సుప్రీంకోర్టు అరుంధతీయులకు మద్దతుగా తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. తమ కోసం న్యాయపోరాటం చేసి విజయం సాధించిన సీఎం స్టాలిన్‌ను శనివారం ఉదయం తేనాంపేటలోని అన్నా అరివాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్న అరుంధతీయ సంఘాల నాయకులు హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

సమాచార దర్శిని

21న నెట్ రీ ఎగ్జామ్

ఐసిఎఫ్, ఆగస్టు 3: నెట్ రీ ఎగ్జామ్ ఈ నెల 21వ తేది జరుగనుందని జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్టీఏ) తెలిపింది. ఆన్‌లైన్‌లో 83 పాఠ్యాంశాలకు నెట్ రీ ఎగ్జామ్ ఈ నెల 21 నుంచి సెప్టెంబరు 4వ తేది వరకు జరుగనుంది. పరీక్షకు సంబంధించిన వివరాలు అభ్యర్థులు ugcnet.nta.nic.in అనే వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చు. పరీక్షా కేంద్రం, హాల్ టిక్కెట్ల విడుదల వంటి వివరాలు http://www.nta.ac.in/ అనే వెబ్‌సైట్‌లో త్వరలో విడుదల చేయనున్నట్లు ఎన్టీఏ తెలిపింది. ఈ పరీక్షకు సంబంధించిన సందేహాల నివృత్తికి 011-40759000 అనే నెంబరు సంప్రదించాలని పేర్కొంది.

నేటినుంచి సిద్ధ, ఆయుర్వేద కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 3: సిద్ధ, ఆయుర్వేద, యునానీ, హోమియోపతి వైద్య కోర్సులకు ఆదివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. ప్రభుత్వ, ప్రైవేటు భారత వైద్య, హోమియో వైద్యకళాశాలల్లో ప్రభుత్వ, అఖిల భారత, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు అడ్మిషన్లు జరుగనున్నాయి. విద్యార్థులు ఈనెల 27వ తేది వరకు https://www.tnhealth.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

నేడు రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ఐసిఎఫ్, ఆగస్టు 3: చెంగల్పట్టు జిల్లా చెస్ సంఘం సహకారంతో సియోన్ ఆల్విన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్, మౌంట్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలల చెస్ పోటీలు ఆదివారం జరుగనున్నాయి. సేలయూరు ఇందిరా గాంధీ నగర్‌లో ఉన్న ఆల్విన్ పబ్లిక్ స్కూలులో 8,10,12,14 ఏళ్ల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో మొదటి 15 స్థానాల్లో నిలిచిన వారికి ట్రోఫీలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మాధవరంలో చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం

ఐసిఎఫ్, ఆగస్టు 3: స్థానిక మాధవరంలో రూ.53 లక్షలతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్, పబ్లిక్ టాయిలెట్లను ఎమ్మెల్యే సుదర్శనం ప్రారంభించారు. మాధవరం మండలం 28వ వార్డు పరిధిలోని కన్నభిరామ్ వీధిలో రూ.33.50 లక్షలతో పబ్లిక్ టాయిలెట్, పెరియార్ వీధిలో రూ.19.40 లక్షలతో పార్క్ నిర్మించగా ఎమ్మెల్యే ప్రజల వినియోగం కోసం ప్రారంభించారు.

వచ్చే నెలలో పశువుల గణన

ఐసిఎఫ్, ఆగస్టు 3: పశువుల గణన సెప్టెంబరులో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న గణనలో 38 జిల్లాల అధికారులు, 1,500 మంది పర్యవేక్షకులు, 6,700 సర్వేయర్లు పాల్గొననున్నారు. పాల ఉత్పత్తిలో రాష్ట్రం ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ఈ గణన చేపట్టనున్నామని, పాడి పశువుల సంఖ్య, ఇతర వివరాలను ప్రభుత్వానికి తెలియజేయనున్నామని అధికారులు తెలిపారు.

తమిళ భాషకు ప్రత్యేక టీవీ ఛానల్

ఐసిఎఫ్, ఆగస్టు 3: తమిళ భాషకు ప్రత్యేక టీవీ ఛానల్‌ను విద్యా మంత్రిత్వ శాఖ పరిచయం చేయనుంది. దేశంలో విద్యా విప్లవం ఏర్పరిచేలా డిజిటల్, ఆన్‌లైన్, ప్రసార విద్యకు సంబంధించి అన్ని ప్రయత్నాలను సమన్వయపరిచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి ఈ-విద్య' పథకం పరిచయం చేసింది. ఈ పథకం దేశవ్యాప్తంగా ఉన్న 25 కోట్ల మంది పాఠశాలల విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా వివిధ మార్గాల్లో విద్య అందజేస్తోంది. వివిధ ప్రాంతీయ భాషలు నేర్చుకోవడంతో పాటు శాస్త్రీయ భాష అయిన తమిళ సాహిత్యం, తమిళ సంగీతం, కళలు, సంస్కృతి, ఆలయాలు, తమిళ సాహిత్య చరిత్ర, తమిళ భాషను హిందీ, ఆంగ్లం ద్వారా నేర్చుకోవడం, తిరుక్కురల్, సిద్ధుల సాహిత్యం, ఆహారపు అలవాట్లు, స్మారక చిహ్నాలున్న ప్రాంతాలు, శిలా శాసనాలు వంటివి భావితరాలకు తెలియజేసే ఉద్దేశంతో ప్రత్యేక టీవీ ఛానల్‌ను పరిచయం చేయనున్నారు.

నలుగురు జాలర్ల అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 3: సరిహద్దులు దాటారంటూ రాష్ట్ర జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. పుదుకోట జిల్లా జగదాపట్టణానికి చెందిన జాలర్లు శుక్రవారం రాత్రి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. నడుదీవి సమీపంలో శనివారం చేపలు పడుతున్న జాలర్లను చుట్టుముట్టిన లంక నావికాదళం, సరిహద్దులు దాటారంటూ వారిని అదుపులోకి తీసుకొని నావికాదళం కార్యాలయానికి తరలించింది. కాగా, రెండు రోజుల క్రితం శ్రీలంక నావికాదళం గస్తీ పడవ ఢీకొని రాష్ట్ర జాలరి మృతిచెందిన ఘటన కలకలం రేపిన తరుణంలో, మళ్లీ లంక నావికాదళం రాష్ట్ర జాలర్లను అరెస్ట్ చేయడంతో జాలర్ల సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

తాత్కాలిక టీచర్ల పదవీకాలం ఐదేళ్లు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 3: ప్రభుత్వ పాఠశాల్లో పనిచేస్తున్న 1,282 మంది తాత్కాలిక ఉపాధ్యాయుల పదవీకాలం మరో ఐదేళ్లు పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2011-12 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో నియమించిన తాత్కాలిక ఉపాధ్యాయుల పదవీకాలం 2022 డిసెంబరుతో ముగిసింది. ఈ నేపథ్యంలో, వీరి పదవీకాలం మరో ఐదేళ్లు పొడిగిస్తూ శనివారం పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

20 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల మార్పు?

● అన్నామలై సంచలన నిర్ణయం

అడయార్, ఆగస్టు 3: తమిళనాడు భారతీయ జనతా పార్టీ లో పెను మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఆ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షుల్లో 20 మందిని మార్చేందుకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై నిర్ణయించారు. ఇటీవల ఆయన ఢిల్లీకి వెళ్ళిన ఆయన... అక్కడ పార్టీ పెద్దలతో వివిధ అంశాలతో పాటు పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించి, మళ్ళీ రాష్ట్రానికి చేరుకున్నారు. అయితే 2026 అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ఇందులోభాగంగా ఆ పార్టీకి ఉన్న 66 మంది జిల్లా అధ్యక్షుల్లో 20 మందిని మార్చాలని ఆయన భావిస్తున్నారు. కాగా, ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసిన స్థానాల్లో ఒక సీటులో కూడా గెలవలేదు. కానీ, 12 స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అసెంబ్లీ సీట్లను గెలుచుకోవాలన్న తలంపులో ఆయన ఉన్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సంసిద్ధులను చేయనున్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

పెరంబూర్, ఆగస్టు 3: తంజావూరు జిల్లా పట్టుకోట మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. సమావేశం అనంతరం కౌన్సిలర్లు వెళ్లిపోగా, కమిషనర్ అధికారులతో సమావేశమయ్యారు. ఆ సమయంలో హఠాత్తుగా అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ నందగోపాల్ నేతృత్వంలో ఇన్స్‌పెక్టర్లు అరుణ్‌ప్రసాద్, శరవణన్ సహా సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన తనిఖీలు శనివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగాయి. ఈ తనిఖీల్లో మున్సిపాలిటీ కమిషనర్ కుమార్ వద్ద రూ.5 లక్షలు, ఏఈ మనోహర్ నుంచి రూ.80వేలు, కాంట్రాక్టర్ ఎడిసన్ నుంచి రూ.66వేలు, డ్రైవర్ వెంకటేష్ నుంచి రూ.8 వేలు మొత్తం రూ.6.54 లక్షలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో, అధికారులు వారిని విచారిస్తున్నారు.



పట్టుబడిన నగదుతో అధికారులు

సబర్బన్ రైళ్ళ రద్దు - ప్రయాణికుల అవస్థలు

● బస్సుల్లో విపరీత రద్దీ
● స్తంభించిన తాంబరం

అడయార్, ఆగస్టు 3: స్థానిక తాంబరం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులతోపాటు ఇంజనీరింగ్ పనులు, ట్రాక్ మార్పిడి, ఇతర మరమ్మతుల కారణంగా చెన్నై బీచ్-తాంబరం, తాంబరం-చెంగల్పట్టు స్టేషన్ల మధ్య సబర్బన్ రైళ్ళను రద్దు చేశారు. ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.40 గంటల వరకు రాత్రి 9 గంటల నుంచి 2.45 గంటల వరకు ఈ రైలు సేవలను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సబర్బన్ రైళ్ళ నిలిపివేతలో నగర రవాణా సంస్థ వివిధ ప్రాంతాల నుంచి అదనపు బస్సులను నడిపింది. ఈ బస్సులు చాలక ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. అదేసమయంలో వాహన రాకపోకలు పెరగడంతో తాంబరంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

ప్రత్యేక రైళ్ళతో ఫలితమేది?

చెన్నై బీచ్ - తాంబరం, తాంబరం - చెంగల్పట్టు ప్రాంతాల మధ్య సబర్బన్ రైళ్ళను రద్దు చేసిన దక్షిణ రైల్వే.. బీచ్ నుంచి పల్లావరం, పల్లావరం నుంచి బీచ్ వరకు ప్రత్యేక రైళ్ళను నడిపింది. ప్రతి 15 నిమిషాలకు ఒక రైలు చొప్పున నడిపింది. అదేవిధంగా చెంగల్పట్టు నుంచి గూడువాంజేరి, గూడువాంజేరి నుంచి చెంగల్పట్టు వరకు ఈ రైళ్ళు నడిచాయి. కానీ, ప్రధాన రైల్వే స్టేషన్ అయిన తాంబరం స్టేషన్ వరకు రైళ్ళు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటు పల్లావరం, అటు గూడువాంజేరి నుంచి తాంబరం వరకు పదుల సంఖ్యలో ఎంటీసీ అదనపు బస్సులను నడిపినప్పటికీ ప్రయాణికుల రద్దీని నివారించలేకపోయింది. అదేసమయంలో సబర్బన్ రైళ్ళ రద్దుతో తాంబరం స్టేషన్ బోసిబోయి కనిపించింది.

స్తంభించిన ట్రాఫిక్...

రైళ్ళ రద్దుతో తాంబరంలో ఒక్కసారిగా వాహన రాకపోకల సంఖ్య పెరిగింది. సాధారణంగా నడిచే నగర బస్సులతోపాటు ఎంటీసీ అదనపు బసులు, ఇతర వాహనాల కారణంగా తాంబరం జీఎస్టీ రహదారి వాహనాలతో కిటకిటలాడిపోయింది. ఒక్కసారిగా వందల సంఖ్యలో వాహనాలు రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. ట్రాఫిక్ పోలీసులు అనేక మార్పులు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తాంబరం నుంచి గూడువాంజేరి వైపు వెళ్ళే బస్సులను హిందూ మిషన్ మీదుగా మళ్ళించారు. ఈ మార్పులు ఈ నెల 14వ తేదీ వరకు అమల్లో ఉంటాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఈ ప్రాంతంలో సుమారు 175 నుంచి 200 మంది వరకు అదనంగా ట్రాఫిక్ పోలీసులను నియమించారు. వీరంతా పల్లావరం, క్రోంపేట, తాంబరం, గూడువాంజేరి, కిలాంబాక్కం తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు.

వయనాడు విపత్తుపై కూడా బీజేపీ రాజకీయం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై



పెరంబూర్, ఆగస్టు 3: వయనాడు విపత్తుపై కూడా బీజేపీ రాజకీయం చేయడంపై తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై ఖండించారు. తేని జిల్లా పళనిసెట్టిపట్టిలో జరిగిన జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశం టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇంట్లో ఈడీ తనిఖీలకు సిద్ధమవుతోందని వార్తలు వస్తున్నాయని, రాజ్యాంగాన్ని రక్షించాలంటూ ఎవరూ గళం విప్పినా వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ శాఖల ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడులు చేయిస్తోందన్నారు. రాహుల్ గాంధీ ఇంట్లో ఈడీ తనిఖీలు చేపట్టడాన్ని కాంగ్రెస్ శ్రేణులు అంగీకరించరని తెలిపారు. పార్లమెంటులో కుల గణన చేపట్టాలని రాహుల్ గాంధీ మాట్లాడే సమయంలో ఆయనకు వ్యతిరేకంగా కేంద్ర మంత్రి అనురాధ్ ఠాగూర్ మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. వయనాడు విపత్తు గురించి ముందే హెచ్చరించామని పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారని, అలా విపత్తు జరిగే అవకాశముంది అని తెలిసినా ముందుగా ఎన్డీఆర్ఎఫ్, సైనిక బలగాలను ఆ రాష్ట్రానికి ఎందుకు పంపించలేదని ప్రశ్నించారు. వయనాడు బాధితులకు ఆదుకొని సహాయాలు అందించేందుకు ఇష్టపడని బీజేపీ, ఆ విపత్తుపై రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కానీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రెండు రోజులు బాధిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను ఓదార్చడంతో పాటు ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారని, ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం రాజకీయాలు మాని, బాధితులను ఆదుకోవాలని సెల్వపెరుందగై డిమాండ్ చేశారు.

ఆవడి కమిషనరేట్ పరిధిలో 18 మందిపై గూండా చట్టం

అడయార్, ఆగస్టు 3: ఆవడి పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన నెల రోజుల్లో 18 మందిపై గూండా చట్టాన్ని ప్రయోగించారు. వీరిలో పాత నేరస్తులతో పాటు పదేపదే నేరాలకు పాల్పడేవారున్నారు. గ్రేటర్ చెన్నై పరిధి విస్తరించడంతో ఆవడి, తాంబరం ప్రాంతాల్లో కొత్తగా పోలీస్ కమిషనరేట్లను ప్రారంభించారు. ఇందులో ఆవడి పోలీస్ కమిషనరేట్ ప్రాంతంలో వివిధ నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా వివిధ నేరాల్లో పాలు పంచుకున్న 68 మంది రౌడీలు, దోపిడీలు, చోరీల కేసులతో సంబంధం ఉన్న 15 మంది, మాదకద్రవ్యాల అక్రమణ రవాణా, విక్రయ కేసులతో సంబంధం ఉన్న 24 మంది, బ్లాక్‌మార్కెట్ కేసుల్లో నలుగురు, సైబర్ నేరాలకు పాల్పడిన ముగ్గురితో పాటు జనవరి నుంచి జూలై వరకు మొత్తం 114 మందిని అరెస్టు చేశారు. అయితే, ఒక్క జూలైలోనే 18 మంది రౌడీలపై ఉక్కుపాదం మోపినట్టు ఆవడి పోలీస్ కమిషనరేట్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న మారియమ్మన్ ఆలయ ఆర్చి



బీటలు బారిన ఆర్చి పైభాగం

పెరంబూర్, ఆగస్టు 3: సమయపురం మారియమ్మన్ ఆలయ ప్రవేశ ద్వారం లారీ ఢీకొనడంతో బీటలువారింది. సమయపురం నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటుచేసిన మారియమ్మన్ ఆలయ ప్రవేశ ద్వారం నుంచి వెళ్లే వాహనాలను డ్రైవర్లు సమీపంలోని నిలిపి అమ్మవారిని దర్శించుకొని వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి సమయపురం నుంచి వచ్చిన లారీ ప్రవేశ ద్వారాన్ని ఢీకొంది. దీంతో, ప్రవేశ ద్వారం పై భాగంలో బీటలు ఏర్పడ్డాయి. దీంతో ఆర్చి కూలే అవకాశముండడంతో ఆ మార్గంలో బారికేడ్లు ఏర్పాటుచేసిన పోలీసుల వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు.

జాతీయ విపత్తులో కేంద్ర ప్రభుత్వం

● డీఎంకే ఎంపీ కనిమొళి ఎద్దేవా

పెరంబూర్, ఆగస్టు 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే జాతీయ విపత్తుల్లో చిక్కుకుందని డీఎంకే ఎంపీ కనిమొళి ఎద్దేవా చేశారు. తూత్తుకుడిలో శనివారం దివ్యాంగులకు సహాయాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కనిమొళి మాట్లాడుతూ... బీజేపీ రహిత రాష్ట్రాల్లో జరుగుతున్న విపత్తులను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తులుగా ప్రకటించడం లేదని, ఎందుకంటే ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వమే జాతీయ విపత్తులో చిక్కుకుందన్నారు. తూత్తుకుడిలో వరదలు సంభవించిన సమయంలో, ముందుగానే హెచ్చరించామని కేంద్రం చెబుతుందన్నారు. అలాగే, ప్రస్తుతం కేరళ రాష్ట్రం వయనాడులో జరిగిన ఘోర విపత్తును కూడా ముందుగానే హెచ్చరించామనే కేంద్ర ప్రభుత్వ ప్రకటనను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారని గుర్తుచేశారు. విపత్తుల ప్రాంతాల్లో బాధితులను ఆదుకోవడం, వారిని పునరావాసం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం నిధులు అందించాలని ఎంపీ కనిమొళి డిమాండ్ చేశారు.

సవుక్కు శంకర్ మళ్ళీ అరెస్టు

అడయార్, ఆగస్టు 3: రెండు వర్గాల మధ్య ఘర్షణలు సృష్టించేలా ప్రసంగించారంటూ నమోదైన కేసు లో అరెస్టు అయిన ప్రముఖ యూట్యూబర్ సవుక్కు శంకర్‌ను కోయంబత్తూరు పోలీసులు గత యేడాది అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో కోవై రేస్ కోర్స్ పోలీసులు అతడిని శుక్రవారం మళ్ళీ అరెస్టు చేసి జైలుకు తరలించారు. అయితే, తాజాగా ఆయనను ఏ కేసులో అరెస్టు చేశారో మాత్రం వెల్లడించలేదు. ఆ తర్వాత జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ నాలుగో కోర్టులో హాజరుపరిచి 15 రోజుల రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థి పెద్ద మనస్సు

● వయనాడు బాధితులకు పొదుపు చేసిన నగదు



దాచిన నగదు లెక్కిస్తున్న కార్తీక్

పెరంబూర్, ఆగస్టు 3: కేరళ రాష్ట్రం వయనాడు ప్రాంతంలో ఏర్పడిన విపత్తు బాధితులకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు వస్తువులు, నగదు అందజేస్తున్నారు. స్థానిక సెయింట్ థామస్ మౌంట్ ఏరికరై ప్రాంతానికి చెందిన త్యాగరాజన్ (ఎంటీసీ బస్సు డ్రైవర్) కుమారుడు పదేళ్ల కార్తీక్ తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్ మనీ హూండీలో దాచుకుంటాడు. వయనాడు బాధితులను ఆదుకొనేలా తాను దాచుకున్న రూ.2,000 అందించాలని నిర్ణయించాడు. కుమారుడి ఇష్టానికి తల్లిదండ్రులు కూడా అంగీకరించారు. దీంతో, కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2,000 కార్తీక్ పంపించారు. కాగా, కార్తీక్ ఇదివరకే 2021లో రాష్ట్రంలో కరోనా తీవ్ర రూపం దాల్చిన సమయంలో తాను, తన సోదరి దాచుకున్న రూ.3,855లను ముఖ్యమంత్రి నివారణ నిధికి అందజేసి ఉండడం గమనార్హం.

1 నుంచి కొత్త ధరకు ధాన్యం కొనుగోలు

● మంత్రి చక్రపాణి

పెరంబూర్, ఆగస్టు 3: ప్రభుత్వం ప్రకటించిన కొత్త ధరకు సెప్టెంబరు 1వ తేది నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్నట్లు ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... 2023-24 ఖరీఫ్ సీజన్‌లో జూలై 31వ తేది వరకు 3,200 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3.85 లక్షల మంది రైతుల నుంచి 33.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.7,277 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. 2024-25 ఏడాది ఖరీఫ్ సీజన్‌కు చిన్నరకం వరి క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.2,450, పెద్దరకం వరి క్వింటాలుకు రూ.2,405గా నిర్ణయించామన్నారు. తమిళనాడు వినియోగ వస్తువుల వాణిజ్య సంస్థ ద్వారా ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో సెప్టెంబరు 1వ తేది నుంచి కొత్త ధరకే ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

కోలాహలంగా 189వ క్రీడా దినోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

పెరంబూర్, ఆగస్టు 3: స్థానిక చెట్‌పెట్‌లోని మద్రాసు క్రిస్టియన్ కాలేజ్ హయ్యర్ సెకండరీ స్కూలులో 189వ క్రీడా దినోత్సవం, 77వ ఎన్‌సీసీ దినోత్సవం శనివారం జరిగాయి. కళాశాల ప్రాంగణంలో ఉదయం ఈ వేడుకలను నార్త్ చెన్నై ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ పి.కుమార్ ప్రారంభించారు. కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.ఎస్.జాన్సన్ ప్రేమ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని, పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెన్నై ఎన్‌సీసీ నావెల్ యూనిట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ రామోజు శ్రీకాంత్, కళాశాల కరస్పాండెంట్ డా.జీజే మనోహర్, హెడ్మాస్టర్ జి.జబదాస్ దినకరన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శ్రీపెరుంబుదూరులో రూ.706.50 కోట్లతో మహిళా వసతి గృహం

● 18న ప్రారంభించనున్న సీఎం స్టాలిన్

అడయార్, ఆగస్టు 3: కాంచీపురం జిల్లా శ్రీపెరంబుదూరులో దేశంలోనే అతి పెద్ద మహిళల వసతి గృహం(వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్) నిర్మాణం పనులు చివరి దశకు చేరుకున్నాయి. రూ.706.50 కోట్లతో నిర్మించిన ఈ వసతి గృహంలో 19 వేల మంది మహిళలు ఉండవచ్చు. దీన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 18వ తేదీ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్, ప్రభుత్వ అధికారులు శనివారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ సెల్వి, ఎస్పీ షణ్ముగం తదితరులున్నారు.

కర్ణాటక వాదన అంగీకరించలేం

● మంత్రి దురైమురుగన్



మెట్టూరు డ్యాం పరిశీలిస్తున్న మంత్రి దురైమురుగన్

పెరంబూర్, ఆగస్టు 3: మెట్టూరు మిగులు జలాలు వినియోగించరాదని పిటిషన్ చేసి, మిగులు జలాలు వృధాగా పోతున్నాయనే కర్ణాటక ప్రభుత్వ వాదన అంగీకరించలేమని నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. మెట్టూరు డ్యాం గత నెల 30వ తేది పూర్తి సామర్థ్యానికి చేరింది. డ్యాం భద్రత దృష్ట్యా అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మంత్రి దురైమురుగన్ శనివారం మెట్టూరు డ్యాం పరిశీలించారు. డ్యాంకు చేరుతున్న నీరు, విడుదల చేస్తున్నది మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... కర్ణాటక ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా మెకెదాటు డ్యాం నిర్మాణానికి అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. సుప్రీంకోర్టు, ట్రిబ్యునళ్ల తీర్పుల్లో మెకెదాటు అనే మాట లేదని, అలాంటి సమయంలో కావేరి నిర్వహణ మండలి మాత్రం మెకెదాటు పేరు ప్రస్తావించడం వెనుక కేంద్ర ప్రభుత్వం ఉందా అనే సందేహం కలుగుతుందన్నారు. మెకెదాటు వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం తీరు రాష్ట్రానికి వ్యతిరేకంగా ఉందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వంలో ప్రారంభించిన మిగులు జలాల పథకంలో 100 చెరువులు మాత్రమే నింపేలా ప్రతిపాదన చేశారని, కానీ ప్రస్తుతం ఆ వంద చెరువులు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదని చమత్కరించారు. ఇప్పటివరకు 52 చెరువులు మిగులు జలాలతో నింపేలా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ బృందాదేవి, ఎంపీలు సెల్వగణపతి, మణి, ఎమ్మెల్యేలు రాజేంద్రన్, సదాశివం, మేట్టూరు సబ్ కలెక్టర్ పొన్‌మణి, నీటిపారుదల శాఖ మండల చీఫ్ ఇంజనీర్ దయాళకుమార్ తదితరులున్నారు.

వర్షాకాలానికి ముందే రోడ్డు పనులు పూర్తి

● అధికారులకు మంత్రి వేలు ఆదేశం

పెరంబూర్, ఆగస్టు 3: వర్షాకాలం ప్రారంభానికి ముందే రోడ్డు పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి ఏవీ వేలు ఆదేశించారు. రహదారుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై శుక్రవారం మంత్రి నేతృత్వంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షపు నీటి కాలువల్లో చేరిన చెత్తాచెదారాలు తొలగించి, వరదల సమయంలో నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు చేపట్టామన్నారు. రహదారుల శాఖకు 'నమ్మ సాలై' అనే కొత్త యాప్ పరిచయం చేశామని తెలిపారు. రోడ్డు పక్కనున్న చెట్లకు తెలుపు, నలుపు రంగులు వేయాలని, రోడ్లపై అడ్డంగా ఉన్న కొమ్మలు, ట్రాఫిక్‌కు అంతరాయం ఉండే చెట్లు తొలగించాలని అధికారులకు సూచించారు. టెండర్లు పొందిన కాంట్రాక్టర్లకు రోడ్డు నిర్మాణ బాధ్యతలు అప్పగించిన తర్వాత పనులు ముగిసే వరకు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

రాజ్యాంగం గురించి తెలుసుకోవాలి

● మంత్రి పొన్ముడి

పెరంబూర్, ఆగస్టు 3: భారత రాజ్యాంగాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి సూచించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... ఏ దేశంలోని ప్రభుత్వమైనా ఆ దేశ రాజ్యాంగాన్ని అనుసరించి పాలన చేస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని విద్యార్థులు తెలుసుకుంటే, ప్రస్తుతం డీఎంకే నేతృత్వంలోని ద్రావిడ మోడల్ పాలన ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. ఇంగ్లాండ్‌లో దేశంలో నడిచేది ఏకీకృత విధానమని, అమెరికాలో ఫెడరల్ రాజ్యాంగమని, భారత దేశంలో ఈ రెండింటితో కూడిన ఉమ్మడి రాష్ట్రాల పాలనా విధానం ఉందని తెలిపారు. కానీ, ప్రస్తుతం రాష్ట్రాల హక్కుల కాలరాసే పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు.

కొండ ప్రాంత జిల్లాలపై ఓ కన్నేయండి

● ప్రభుత్వం ఆదేశం

అడయార్, ఆగస్టు 3: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పలు గ్రామాలు నామరూపాలు లేకుండా పోయిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలోని కొండ ప్రాంత జిల్లాలపై దృష్టిసారించి, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ముఖ్యంగా విరుదునగర్, తేని, తిరుపూర్, నీలగిరి, దిండిగల్, కన్నియాకుమారి, కోయంబత్తూరు, తిరునెల్వేలి జిల్లాలపై దృష్టిసారించాలని సూచించింది. రానున్నది వర్షాకాలం కావడంతో ప్రత్యేక దృష్టిసారించి, ఏదైనా చిన్న సంఘటన జరిగినా జిల్లా యంత్రాంగానికి తక్షణం సమాచారం చేరవేయాలని ఆదేశించింది. అదే సమయంలో రెవెన్యూ, విపత్తుల నిర్వహణ విభాగాల సమన్వయంతో ఈ పర్యవేక్షణ కొనసాగించాలని కోరింది.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

● మంత్రి గాంధీ



విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేస్తున్న మంత్రి గాంధీ

పెరంబూర్, ఆగస్టు 3: విద్యారంగానికి ముఖ్యమంత్రి స్టాలిన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి గాంధీ పేర్కొన్నారు. రాణిపేట జిల్లా వాలాజాబాద్‌లోని ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సైకిళ్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సదుపాయాలు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య అధికమైందన్నారు. విద్యార్థులు కూడా ఈ పథకాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో అభివృద్ధి చెందాలని మంత్రి సూచించారు.

ఊటీ బోట్‌హౌస్‌లో పర్యాటకుల సందడి



పెరంబూర్, ఆగస్టు 3: నాలుగు రోజుల అనంతరం నీలగిరి జిల్లా ఊటీలో పర్యాటకుల రద్దీ అధికమైంది. నైరుతి రుతుపవనాల కారణంగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు ఈదురుగాలులు తోడడంతో కొండ ప్రాంతాల్లో మట్టిచెరియలు, చెట్లు విరిగి పడుతున్నాయి. అలాగే, కొండ రైలు మార్గంలో మట్టిచెరియలు, కొమ్మలు విరిగిపడడంతో కొండ రైలు సేవలు ఈనెల 6వ తేది వరకు రద్దుచేశారు. భారీవర్షాలు కురుస్తాయనే వాతావరణ హెచ్చరికలతో, పర్యాటకులు ఊటీకి రావడం విరమించుకోవాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తిచేసింది. ఈ నేపథ్యంలో, రెండు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడం, వారాంతపు సెలవులు కావడంతో శనివారం ఊటీకి పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కొండరైలు రద్దు కావడంతో నిరాశ చెందిన పర్యాటకులు, బోట్ హౌస్‌లో బోట్లలో షికారు చేసూ గడిపారు.

నాగరాజ ఆలయానికి కొబ్బరి ఆకుల పందిరి



ఐసిఎఫ్, ఆగస్టు 3: కన్నియాకుమారి జిల్లా నాగరాజ ఆలయ సన్నిధికి పూజారులు కొబ్బరి ఆకులతో పందిరి వేశారు. ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయంలో మూలస్థానం నుంచి తీసే మట్టిని భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. మూలస్థానం పైకప్పు కొబ్బరి ఆకులతో పందిరిలా ఏర్పాటుచేస్తుంటారు. ఆడి మాసంలో పైకప్పు కొత్త కొబ్బరి ఆకులతో వేయడం ఆనవాయితి. ఆ ప్రకారం, శుక్రవారం గర్భగుడి పైకప్పును తొలగించి కొత్తగా కొబ్బరి ఆకులతో పూజారులు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో మేల్‌శాంతిహరీషా, నారాయణన్ నంబూద్రి, కృష్ణదాస్ నంబూద్రి, కీల్‌శాంతిగళ్ పాల్గొన్నారు.

భక్తుల కోసం షవర్ల ఏర్పాటు



షవర్ల కింద స్నానం చేస్తున్న భక్తులు

ఐసిఎఫ్, ఆగస్టు 3: ఆడిపెరుక్కు ఉత్సవాలను పురస్కరించుకొని భవానికూడుతురై-అమ్మాపేట కావేరి తీరంలో భక్తుల సౌకర్యార్థం షవర్లు ఏర్పాటుచేశారు. ఈరోడ్ జిల్లా భవానీ నగరంలో ప్రసిద్ధిగాంచిన భవాని సంగమేశ్వరాలయం ఉంది. ప్రతి ఏటా వివిధ కార్యక్రమాలు ఆలయంలో నిర్వహిస్తుంటారు. ఆడి అమావాస్య రోజున వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి తర్పణాలు వదులుతుంటారు. ఈ నేపథ్యంలో, మేట్టూరు డ్యాం పూర్తి సామర్థ్యంతో నిండడంతో మిగులు జలాలను విడుదల చేస్తున్నారు. దీంతో, భవాని, కావేరి తీరాల్లో రెండు వైపులా ప్రవాహం ఉధృతిగా ఉంది. ఇక్కడ భక్తులు స్నానం చేస్తూ ప్రమాదానికి గురయ్యే అవకాశాలుండడంతో, వారి సౌకర్యార్థం రేకుల షెడ్ ఏర్పాటుచేసి మహిళలు, పురుషులకు వేర్వేరుగా షవర్లు ఏర్పాటుచేశారు.

డీఎంకే పాలనలో పెరిగిన హత్యలు

● బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆగ్రహం



అడయార్, ఆగస్టు 3: డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో హత్యలు పెరిగిపోయాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై ఆరోపించారు. ఈవిషయంపై ఆయన శనివారం తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. కోయంబత్తూరులో శుక్రవారం ఉదయకుమార్ అనే న్యాయవాది దారుణ హత్యకు గురయ్యాడన్న వార్త ఎంతో బాధ కలిగిస్తుందన్న ఆయన న్యాయవాది కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాతనే హత్యలు జరగడం సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. హోం శాఖ తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియడం లేదన్నారు. ఒక జాతీయ పార్టీకి చెందిన రాష్ట్ర అధ్యక్షుడు నుంచి ప్రారంభమై డీఎంకే మిత్రపక్షమైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాదులు, సాధారణ ప్రజలు ఇలా ఏ ఒక్కరి ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పోలీస్ శాఖను మరింత పటిష్టం చేసి, శాంతిభద్రతలను పరిరక్షించేలా కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని కె.అన్నామలై కోరారు.

చిత్రజ్యోతి



'వాస్కోడిగామ'లో నకుల్ - అర్థనా బిను

సందేశాత్మక కథాంశంతో 'వాస్కోడిగామ'

అన్యాయం చేసిన వాళ్ళంతా బయట స్వేచ్ఛగా తిరుగుతుంటే... అమాయకులు, మంచివాళ్ళంతా జైళ్ళలో మగ్గుతున్నారు.ఈ దేశంలో మంచివాళ్ళకు స్థానం లేదా? అంటూ ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే మంచి కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'వాస్కోడిగామ'. నకుల్, అర్థనా బిను జంటగా నటించగా, కేఎస్ రవికుమార్, వంశీకృష్ణ, ప్రేమ కుమార్, మునీష్‌కాంత్ రాందాస్, రమ, మన్సూర్ అలీఖాన్, ఆనంద్ రాజ్ నమో నారాయణ, లొల్లు సభ శేషు, బైల్వాన్ రంగనాథన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. 5656 ప్రొడక్షన్స్‌పై నిర్మితమైన ఈ చిత్రానికి ఆర్‌జీకే దర్శకత్వం, అరుణ్ ఎన్‌వీ సంగీతం సమకూర్చారు. ఈ సందర్భంగా ఈ చిత్ర కథను దర్శకుడు వివరిస్తూ.. 'దేశ ప్రయోజనాలు తగ్గిపోయి, దుర్మార్గాలు పెరిగిపోయాయి. శతృత్వం, ద్రోహం పెరిగిన సంఘటనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరికొంతకాలానికి ఇదే పరిస్థితి ఎలా మారిపోతుందన్నదే ఈ సినిమా ఊహాజనిత కథ. వన్‌లైన్‌లో చెప్పాలంటే, నేరాలు ఘోరాలు, అన్యాయాలు చేసిన వారంతా బయట ఉంటే, మంచివాళ్ళంతా జైల్లలో ఉంటారు. దెయ్యాలు రాజ్యమేలుతాయి, శవాలను భక్షిస్తాయి అని మహాకవి భారతి అన్నట్టుగా అధికారం దుర్మార్గుల చేతుల్లోకి వెళ్తే ఏమవుతుందో ఊహించడం కష్టం. సినిమా తొలి అర్థభాగంలో హీరో నకుల్, రెండో సగభాగంలో హీరోయిన్ అర్థనా, ఆమె కుటుంబ సభ్యుల మధ్య కథ సాగుతుంది. ఇందులో చాక్లెట్‌బాయ్‌గా గుర్తింపు పొందిన నకుల్ ఇందులో మంచిగా, ఆ తర్వాత చెడ్డ వ్యక్తిగా మారిపోతాడు. హీరోయిన్ పాత్ర ఎంతో అందంగా చూపించాం. ఊహాజనిత కథాంశానికి హాస్యాన్ని జోడించి తెరకెక్కించాం. ఎలాంటి లాజిక్‌లు చూడకుండా, కేవలం హాస్యాన్ని కోరుకునే ప్రేక్షకులకు ఈ సినిమా ఓ పండుగ వంటిది' అని పేర్కొన్నారు.



రజనీకాంత్‌తో నితిలన్ స్వామినాథన్

యువ దర్శకుడికి సూపర్‌స్టార్ ప్రశంసలు

యువ దర్శకుడు నితిలన్ స్వామినాథన్‌పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసల వర్షం కురిపించారు. తన నివాసానికి ఆహ్వానించి అభినందించారు. విజయ్ సేతుపతి హీరోగా నితిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో వచ్చిన 'మహారాజ' మూవీ సూపర్‌హిట్ అయింది. మంచి కథాంశంతో రూపుదిద్దుకున్న ఈ మూవీకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడంతో ఇటీవలే 50 రోజులు పూర్తి చేసుకుంది. రూ.100 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలోనూ విశేష ఆదరణ వస్తోంది. ఈ నేపథ్యంలో నితిలన్‌ను తలైవర్ తన నివాసానికి ఆహ్వానించి అభినందించారు. రజనీతో తన భేటీకి సంబంధించిన ఫొటోలను యువ దర్శకుడు ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. 'ఈ అద్భుతమైన సమావేశానికి ధన్యవాదాలు. ఈ భేటీ.. జీవితం, అనుభవం, జీవన విధానాల గురించి ఓ నవల చదివిన అనుభూతి కలిగింది. మీ ఆతిథ్యం వినయం చూసి ఆశ్చర్యపోయాను. 'మహారాజ' సినిమా మీకు ఎంతగానో నచ్చిందని తెలుసుకుని ఉప్పొంగిపోతున్నా. ధన్యవాదాలు సర్' అంటూ ట్వీట్ చేశారు.

సర్వైవల్ మూవీగా యోగిబాబు 'బోట్'

అగ్ర దర్శకుడు ఎస్.శంకర్ శిష్యుడు శింబుదేవన్, ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కించిన చిత్రం 'బోట్'. ఒక సర్వైవల్ మూవీగా రూపొందించారు. సాధారణంగా ఈ తరహా సినిమాలకు దేశంలో ఆదరణ లభించిన సందర్భాలు పెద్దగా లేవు. అయినప్పటికీ అలాంటి కథాంశంతోనే దర్శకుడు ప్రయోగం చేశారు. శింబుదేవన్ గతంలో దర్శకత్వం వహించిన చిత్రాలకు భిన్నంగా తెరకెక్కించారు. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథ. మద్రాస్‌కు చెందిన యోగిబాబు... తన అమ్మతో కలిసి బ్రిటీష్ పాలకుల చెరలో ఉన్న తమ్ముడిని విడిపించుకునేందుకు ప్రయత్నిస్తాడు. ఆ సమయంలో మద్రాస్ నగరంపై జపాన్ బాంబుల వర్షం కురిపిస్తుంది. ఈ దాడుల నుంచి తప్పించుకునేందుకు ఒక పడవలో సముద్రంలోకి వెళతారు. ఇందులో గర్భిణి భార్య, కుమారుడు, ఒక నాస్తికుడు, ఒక బ్రాహ్మణుడు, ఈయన కుమార్తె, ఒక ముస్లిం, ఒక ఉత్తరాది వ్యక్తి ఉంటారు. సముద్రంలో మరో బ్రిటిష్ వ్యక్తి వీరితో కలుస్తాడు. తెల్లవాడు చేసిన గొడవ కారణంగా పడవ దెబ్బతింటుంది. అదేసమయంలో మారువేషంలో ఒక ఉగ్రవాది పడవలో ఉన్నట్టు తెలుసుకుంటారు. ఆ ఉగ్రవాది ఎవరు? వీరంతా తిరిగి క్షేమంగా తీరానికి చేరుకున్నారా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ. వినోదం, హాస్యం పాళ్ళు పెద్దగా కనిపించలేదు. అయితే, ఒక సర్వైవల్ డ్రామా కథ. కామెడీ, సమాజంతో పాటు భవిష్యత్ సంఘటనలపై ముందుగానే సెటైర్లు వేయడం వంటి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పొచ్చు.

'బోట్'లో ఓ దృశ్యం





విజయ్ రోల్స్ రాయిస్ కారు

విక్రయానికి హీరో విజయ్ కారు

స్టార్ హీరో విజయ్‌కు చెందిన రోల్స్ రాయిస్ కారు విక్రయానికి ఉంచారు. రోల్స్ రాయిస్ ఘోస్ట్ అనే మోడల్ లగ్జరీ కారును 2012లో విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. ఈ కారుకు 132 శాతం దిగుమతి సుంకాన్ని విధించారు. దీన్ని వ్యతిరేకిస్తూ హీరో విజయ్ న్యాయపోరాటం చేశారు. పలు దఫాలుగా విచారణ జరిగింది. ఆ తర్వాత రూ.లక్ష పన్ను విధించిన న్యాయమూర్తి... వెండితెరపై రీల్ హీరోగా ఉన్నప్పటికీ నిజ జీవితంలో రియల్ హీరోగా ఉండాలంటూ హితవు పలికారు. అప్పట్లో ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో ఎంపవర్ ఆటో అనే డీలర్‌షిప్‌లో విజయ్ కారును విక్రయానికి ఉంచారు. ఈ కారు ధరను రూ.2.6 కోట్లుగా నిర్ణయించారు. అయితే, ఈ ధర శాశ్వతం కాదని, కొనుగోలుదారుల డిమాండ్ మేరకు మారుతుందన్నారు. ఈ కారు విక్రయానికి సంబంధించిన ప్రకటన ఆన్‌లైన్‌లో పెట్టడంతో వైరల్‌గా మారింది.



SUNDAY SPECIAL

భక్తిశ్రద్ధలతో దీప పూజలు

పెరంబూర్, ఆగస్టు 3: తిరువణ్ణామలైలో ప్రసిద్ధిచెందిన అరుణాచలేశ్వరాలయంలో నిర్వహించిన దీప పూజల్లో వందలాది మహిళలు పాల్గొన్నారు. ఆడి మాసం మూడో శుక్రవారం సందర్భంగా తిరుకల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో దీపాలు వెలిగించి పారాయణం చేసిన భక్తులు, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ప్రార్థన చేశారు.

దీప పూజల్లో మహిళలు



అన్నానగర్‌లో 'రివర్'



వేళచ్చేరి, ఆగస్టు 3: బెంగుళూరుకు చెందిన ఈవీ స్టార్టప్ 'రివర్' రాష్ట్రంలోకి మొట్టమొదటిసారిగా అడుగుపెట్టింది. బెంగళూరు, హైదరాబాద్‌ల తరువాత చెన్నైలో షోరూం ప్రారంభించింది. స్థానిక అన్నానగర్ ఈస్ట్, 6వ అవెన్యూ రోడ్‌లో ఈ స్టోర్ ఏర్పాటైంది. ఈ స్టోర్ ప్రారంభోత్సవం సందర్భంగా సంస్థ సహ వ్యవస్థాపకుడు అరవింద్ మణి మాట్లాడుతూ.. ఈ ఏడాది చివరిలోపే కోయంబత్తూర్, త్రివేండ్రం, అహ్మదాబాద్, ముంబై తదితర 50 నగరాల్లో విస్తరించనున్నామని తెలిపారు.

పెంపుడు జంతువులకు ప్రత్యేక పార్క్

రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా పెంపుడు జంతువుల కోసం ప్రత్యేక పార్క్ ఏర్పాటుకానుంది. రూ.కోటి వ్యయంతో నగరంలో ఆ పార్క్ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక థౌజండ్ లైట్స్ ప్రాంతంలో ఉన్న కార్పొరేషన్ పార్క్‌లో మే నెలలో ఒక చిన్నారిపై రెండు రాట్‌వైలర్ శునకాలు దాడిచేయడంతో శునకాల యజమానిని పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నా, పార్క్‌లో చిన్నారిపై దాడి తీవ్ర చర్చనీయాంశమైంది. నగరంలోని పార్క్‌ల్లో ఉదయం, సాయంత్రం ప్రజలు వాకింగ్‌కు వెళ్తుంటారు. అదే సమయంలో కొందరు యజమానులు తాము పెంచుకుంటున్న శునకాలతో పార్క్‌కు వస్తున్నారు. తమ యజమాని, ఆయన కుటుంబసభ్యులతో మాత్రమే అనుబంధం ఉన్న శునకాలు, ఒక్కసారిగా బయటకు వచ్చి అధిక సంఖ్యలో ప్రజలను చూసి బెదిరి దాడి చేస్తున్నాయి.

- పెరంబూర్



పార్క్‌లో ఏర్పాటుకానున్న వసతులు



డిమాండి కాలనీలో ఏర్పాటవుతున్న పెట్ పార్క్

నగరంలో తొలిసారిగా రూ. కోటి వ్యయంతో ఏర్పాటు

మైలాపూర్ డిమాండి కాలనీలో నిర్మాణం

మైలాపూర్ డిమాండి కాలనీలో..

హైదరాబాద్ వంటి నగరాల్లో పెంపుడు జంతువులను బయటకు తీసుకొచ్చి, అవి స్వేచ్ఛగా తిరిగేలా ప్రత్యేక పార్కులున్నాయి. కానీ, రాష్ట్రంలో మాత్రం అలాంటి పార్క్ ఇప్పటివరకు లేదు. ఈ నేపథ్యంలో, మైలాపూర్ నియోజకవర్గ పరిధిలోని డిమాండి కాలనీలో ఉన్న ఓ పార్క్‌ను పెంపుడు జంతువులు స్వేచ్ఛగా తిరిగేలా, 'ఉంగల్ తొగుదియిల్ ముదలమైచ్చర్' పథకం కింద ఏర్పాటు చేయాలని కోరుతూ మైలాపూర్ ఎమ్మెల్యే టి.వేలు కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో, డిమాండి కాలనీ పార్క్‌ను పెంపుడు జంతువుల కోసం మార్చేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. తొలివిడతగా ఈ పథకానికి రూ.కోటి నిధులు కేటాయించింది.

పలు సౌకర్యాలు... : ఈ పార్క్‌లో సుమారు 30 శునకాలను ఉంచేలా సదుపాయాలు కల్పిస్తున్నారు. అలాగే, పెంపుడు జంతువులకు వాకింగ్, ఆడుకొనేందుకు వివిధ రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు అధికంగా పెంపుడు జంతువులను సంరక్షిస్తున్నారు. అదే విధంగా ఎక్కువ మంది జంతువులకు లైసెన్స్ కూడా తీసుకున్నారు. అందువల్లే ఈ ప్రాంతాన్ని కార్పొరేషన్ ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. దీనిపై పెంపుడు జంతువుల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యజమానుల హర్షం....

నగర ప్రాంతాల్లో జంతువుల పెంపకంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఖరీదైన శునకాలు, పిల్లల సహా పలురకాల జంతువులు, పక్షులను పెంచుకుంటున్నారు. ఒక్కో సమయంలో శునకాలు తమ యజమానులు ప్రమాదాల నుంచి కాపాడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఆ ప్రాణులను తమ కుటుంబంలో ఒక వ్యక్తిగా వారు పరిగణిస్తూ ఆప్యాయత, అనురాగాలు చూపిస్తుంటారు. ఒకవేళ తాము సంరక్షిస్తున్న పెంపుడు జంతువులు తప్పిపోయిన సమయంలో వాటి యజమానుల ఆందోళన అంతా ఇంతా కాదు. 'తమ పెంపుడు జంతువు తప్పిపోయిందని...దానిని అప్పగిస్తే బహుమతులు అందిస్తామంటూ పోస్టర్లు' వేసే పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో ఇంట్లోనే ఉండే జంతువులను ఉదయం, సాయంత్రం బయటకు తీసుకెళ్తుంటారు. ఆ సమయంలో ఊహించని విధంగా అవి ప్రజలపై దాడి చేస్తుండడం యజమానులకు తలనొప్పిగా మారింది. ఈ క్రమంలో, పెంపుడు ప్రాణుల కోసం ప్రత్యేక పార్క్ ఏర్పాటుచేస్తుండడం పట్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ...ఈ పార్క్‌కు పెంపుడు జంతువులు తీసుకొచ్చే యజమానులు తప్పనిసరిగా వాటికి లైసెన్స్ పొంది ఉండాలనే నిబంధన లేదన్నారు. అదే సమయంలో పెంపుడు జంతువుల సంరక్షణకు లైసెన్స్ పొందడం యజమానులు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.నగరంలో ఇదే తొలి పెంపుడు జంతువులు పార్క్ కానుంది.డిమాండి కాలనీ పార్క్‌పై ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని నగరంలో పలు ప్రాంతాల్లో మోడల్ పార్క్‌ల ఏర్పాటుకు అధికారులు అవసరమైన స్థలాలు ఎంపిక చేస్తామని అధికారులు వివరించారు.

కావేరి మాతకు ప్రత్యేక పూజలు

నదీ పరివాహక ప్రాంతాల్లో పుణ్యస్నానాలు



తాళి మార్చుకుంటున్న నూతన వధువులు



తిరుచెందూర్ సురభి ఘాట్‌లో భక్తుల పుణ్యస్నానాలు

ప్యారీస్, ఆగస్టు 3: రాష్ట్రంలో కావేరి నదీ పరీవాహక ప్రాంతాలైన హొగెనేకల్ నుంచి పూంపుహార్ వరకు కావేరి డెల్టా జిల్లాలు, కావేరి తీరప్రాంతాల్లో తమిళులు మరో పుష్కరంగా భావించే ఆడిపెరుక్కు వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. డెల్టా జిల్లాల మీదుగా ప్రవహించి సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుస్తున్న కావేరి తల్లికి కూరగాయలు, పండ్లు, పూలు, నవధాన్యాలు సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. ఆడిపెరుక్కు సందర్భంగా కొత్త మంగళసూత్రాలు ధరించారు. సకల సంపదలు కలుగాలని డెల్టా రైతులు ప్రార్థించారు. ఈరోడ్ జిల్లాలోని కావేరి, భవాని నదులు సంగమ ప్రాంతమైన కూడుదురైలో, కడలూరు జిల్లా చిదంబరం పరిసర ప్రాంతాలు, కొల్లిడం జలాశయంలో, సేలం జిల్లాలోని ఎడప్పాడి సమీపంలో ఉన్న బూలంపట్టి కావేరి నది కాలువ తీరంలోనే కాకుండా కావేరీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి.

సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు...

స్థానిక రాజా అన్నామలైపురంలో ఉన్న డా.ఎంజీఆర్ జానకి మహిళా కళాశాలలో ఆడిపెరుక్కు వేడుకలను శుక్రవారం కోలాహలంగా జరుపుకున్నారు. సుమారు 4వేల మందికి పైగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో నీటితొట్టెలో దీపాలు వదిలి దేశం సుభిక్షంగా ఉండాలంటూ ప్రార్థించారు. తమిళ సంప్రదాయం గుర్తుచేస్తూ గరగాట్టం, నెమలాట్టం, కోలాటం, ఉట్టికొట్టి, జానపద నృత్యాలతో తమిళ సంస్కృతికి అద్దం పట్టారు.



తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ ఆలయంలో భక్తుల రద్దీ



అడయార్‌లో సంప్రదాయ వస్త్రధారణతో కావేరి తల్లికి పూజలు నిర్వహిస్తున్న విద్యార్థినులు



సీఏ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అవార్డుతో సత్కరిస్తున్న రాజేంద్రప్రసాద్, కార్తీక్ తదితరులు

ఘనంగా ఏఎన్ఎం అవార్డుల ప్రదానోత్సవం

ప్యారీస్, ఆగస్టు 3: స్థానిక మైలాపూర్‌లోని ఆర్ఆర్ సభ ఆడిటోరియంలో శనివారం అనీష్ నూర్ మహ్మద్ (ఏఎన్ఎం) అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఏఎన్ఎం సంస్థ నిర్వాహకులు కార్తీక్-నివేద దంపతుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2024 మే నెలలో నిర్వహించిన సీఏ పరీక్షల్లో అన్ని కోర్సుల్లో ఉత్తీర్ణులైన 250 మంది విద్యార్థినీ, విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... సీఏ పరీక్షల్లో సత్తాచాటిన విద్యార్థులు జీవితంలో ప్రజ్ఞావంతులుగా మారడం ఎలా అనే అంశాలను నేర్చుకోవాలని, అలాగే సాఫ్ట్‌వేర్ రంగంలో మెళకువలు నేర్చుకుంటే ఈ వృత్తిలో వేగంగా అభివృద్ధి చెందుతారని సూచించారు.

ధీరన్ చిన్నమలైకి నేతల ఘననివాళి

ప్యారీస్, ఆగస్టు 3: స్వాతంత్ర్య సమరయోధుడు ధీరన్ చిన్నమలై 219వ వర్ధంతి సందర్భంగా గిండిలో ఉన్న ఆయన విగ్రహానికి శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాళులర్పించారు. ధీరన్ చిన్నమలై విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటానికి మంత్రులు ఎం.సుబ్రమణ్యం, కె.పొన్ముడి, ఎంపీ స్వామినాధన్, చక్రపాణి, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, సమాచారశాఖ కార్యదర్శి వి.రాజారామన్, డైరెక్టర్ ఆర్.వైద్యనాథన్ తదితర అధికారులు నివాళులర్పించారు. అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ప్రిసీడియం చైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు సి.పొన్నయ్యన్, డి.జయకుమార్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా కార్యదర్శులు పలువురు పాల్గొని నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్, తమిళ మానీల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, సమత్తువ కళగం అధ్యక్షుడు ఎర్నావూర్ నారాయణన్ తదితరులు నివాళులర్పించారు.





ధీరన్ చిన్నమలై చిత్రపటానికి సీఎం స్టాలిన్ సహా మంత్రుల నివాళి - అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, మాజీ మంత్రుల నివాళి



రాష్ట్ర సమాచార, తమిళ అభివృద్ధిశాఖ మంత్రి ఎంపీ స్వామినాథన్ శనివారం చెన్నై ఎగ్మూరు మ్యూజియంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్ ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

చెన్నై-కాట్పాడి వందే మెట్రోరైల్ ట్రయల్ రన్ విజయవంతం

ప్యారీస్, ఆగస్టు 3: చెన్నై-కాట్పాడి మధ్య వందే భారత్ మెట్రోరైలు ట్రయల్ రన్ శనివారం విజయవంతంగా జరిగింది. గంటకు 180 కి.మీ వేగంతో 12 ఏసీ బోగీలతో సాగిన ట్రయల్ రన్‌లో ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్) జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విల్లివాక్కం రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 8.15 గంటలకు బయల్దేరిన ఈ రైలు అరక్కోణం మీదుగా మధ్యాహ్నం 11.55 గంటలకు కాట్పాడి చేరుకుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వందే భారత్ సూపర్ ఫాస్ట్ రైళ్ల సేవలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో చెన్నై నుంచి బెంగళూరు, మంగుళూరు, కోవై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్ తదితర నగరాలకు నడుపుతున్న వందే భారత్ రైళ్లకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో ఐసిఎఫ్‌లో తయారైన తొలి వందే మెట్రోరైలు ట్రయల్ రన్ శనివారం విజయవంతం కావడంతో ఐసిఎఫ్ జనరల్ మేనేజర్ సుబ్బారావు, రైలు డిజైన్ చేసిన అధికారులు, కార్మికులను అభినందించారు.



వందే మెట్రోరైలు ట్రయల్ రన్ - రైలులో ప్రయాణిస్తున్న ఐసిఎఫ్ జీఎం యు.సుబ్బారావు, రైల్వే ఉన్నతాధికారులు



